క్లుప్తంగా

శాకంబరీదేవిగా పార్వతి అమ్మవారు

పామర్రు: స్థానిక సోమేశ్వరస్వామి ఆలయంలోని పార్వతి అమ్మవారిని బుధవారం శాకంబరీ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రముఖ వ్యాపార వేత్త పువ్వాడ శ్రీనివాసరావు సౌజన్యంతో అమ్మవారిని ముత్తేవి మాధవ్‌కుమార్ శాకంబరీగా అలంకరించారు. లంకా భీష్మకుమార్ ఆధ్వర్యంలో పూజాధికాలను చేశారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



గుడివాడ టౌన్: స్థానిక కేటీఆర్ మహిళా కళాశాల విద్యార్థులకు గుడివాడ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. స్థానిక గురురాజు ప్రభుత్వ హోమియో కళాశాలకు చెందిన వైద్యులు ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో విద్యార్థినులకు స్త్రీలకు సంబంధించిన వైద్య సూచనలు, సలహాలపై అవగాహన సదస్సు నిర్వహించి, అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సుష్మ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ పి.నిర్మల, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఎస్.శేషగిరి, కార్యదర్శి ఎ.నవీన్, సభ్యులు ఉపద్రష్ట రాంబాబు, డాక్టర్ రామ్ నారాయణ్ పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ



గుడివాడ టౌన్: శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. స్థానిక సత్యనారాయణపురంలోని భవిత కేంద్రం (దివ్యాంగుల శిక్షణ కేంద్రం)లో ప్రముఖ వ్యాపారవేత్త, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు పర్వతనేని ఆనంద్ వితరణతో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సేవా సంఘం అధ్యక్షుడు పుట్టి హరికుమార్, పట్టణ ప్రముఖులు బొగ్గారపు తిరుపతయ్య, లయన్స్‌క్లబ్ జేసీ వైవీ కృష్ణారావు, జాజుల తాతారావు, ఎం.సత్యం, కె.హరిబాబు, కేంద్రం నిర్వాహకులు ఎంకె.నీలాంబ్రమ్, ఎస్‌కె.ఫజీల్ పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడండి

గుడివాడ టౌన్: ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ సభ్యులు బుధవారం మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు ఎం.శివరామకృష్ణ మాట్లాడుతూ ఐ లవ్ గుడివాడ కార్యక్రమాన్ని ఆదర్శంగా తీసుకుని స్థానిక 36వ వార్డు నాగవరప్పాడు మెయిన్ రోడ్‌లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రతి ఇంటి వద్ద ఒక మంచి మొక్కను నాటి దాని పరిరక్షణను ఆ ఇంటి యజమానికి అప్పగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి కె.రామారావు, కోశాధికారి కె.రామకృష్ణ, జెడ్సీ పి. సత్యనారాయణ, డిప్యూటీ గవర్నర్ అర్జా ప్రసాదు, ప్రాజెక్ట్ చైర్మన్ ఎల్.శివరామ్ ప్రసాద్, సభ్యులు వి.బ్రహ్మాజీ, ఎం.హనుమంతరావు, ఎస్.ప్రసాద్, ఎం.రామకృష్ణ పాల్గొన్నారు.

ఆలయాల హుండీల ఆదాయం రూ.4.26 లక్షలు

కైకలూరు: స్థానికంగా ఉన్న వివిధ దేవాలయాల్లో హుండీలను బుధవారం తెరిచి లెక్కించగా రూ.4,26,110 ఆదాయం వచ్చినట్లు గుడివాడ దేవదాయశాఖ తనిఖీ అధికారి వి.సుధాకర్ చెప్పారు. కైకలూరులో శ్యామలాంబ దేవాలయంలో రూ.2,66,808, వెంకటేశ్వరస్వామి (మీసాల వెంకన్న) ఆలయంలో రూ.1,35,558, రామలింగేశ్వరస్వామి ఆలయంలో రూ.23,744 హుండీల ద్వారా నాలుగు నెలల 22 రోజులకు ఈ ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. గ్రూపు దేవాలయాల ఈఓ వీఎస్‌కే శేఖర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓ ప్రభాకరరావుకు సన్మానం



కైకలూరు: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసే ఉద్యోగులు అన్ని చోట్లా గౌరవం పొందుతారని డీఈఓ అబ్రహం అన్నారు. ఎంఈఓ-2 పిడుగు ప్రభాకరరావు ఉద్యోగ విరమణ సన్మానసభ కలిదిండిలో బుధవారం జరిగింది. డీఈఓ మాట్లాడుతూ ఎంతో మంది విద్యార్థులు ఉన్నత స్థితిలో నిలవడానికి ప్రభాకరరావు కృషి చేశారన్నారు. అనంతరం ఎంఈఓ దంపతులను ఘనంగా సన్మానించారు. ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, డీవైఈఓ రవిప్రకాష్, పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు డి.శ్రీను, ఎంపీడీఓ దినతేజ్, ఈఓపీఆర్డీ రాజారావు, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సాగర్‌బాబు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సారె సంబరం



పామర్రులో అమ్మవారికి ఆషాఢ సారెను అందజేస్తున్న భక్తులు



కోటకలిదిండిలో గంగానమ్మకు ఆషాఢ సారె సమర్పిస్తున్న భక్తులు

పామర్రు: స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలోని రాజ్యలక్ష్మి అమ్మవారి సన్నిధిలో బుధవారం నిర్వహించిన ఆషాఢ సారె సంబరం అంబరాన్నంటింది. 50 మందికి పైగా భక్తులు అమ్మవారికి సారెను సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి భక్తుల రద్దీ ఎక్కువైంది. స్థానిక ఆర్యవైశ్య సంఘ మహిళా సభ్యులతో పాటు మహిళా సంఘాల సభ్యులు అమ్మవారికి ఆషాఢ సారెను సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివార్లకు విశేషంగా పూజాధికాలను స్నపన కార్యక్రమాలను నిర్వహించారు. అమ్మవారికి విశేషంగా శత సహస్ర నామాలతో కుంకుమ పూజ చేశారు. తొలుత భక్తులు సారెతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అనంతరం అమ్మవారికి సమర్పించారు.

గంగానమ్మకు..

కైకలూరు: కోటకలిదిండి గంగానమ్మ ఆలయంలో అమ్మవారికి ఆషాఢ సారెను బుధవారం సమర్పించారు. మేళతాళాలతో మహిళలు కలశ బిందెలు, స్వీట్లు, పండ్లు, పసుపు, కుంకుమ, గాజుల తదితర రకాలతో కూడిన సారెను మహిళలు ఊరేగింపుగా తీసుకొచ్చారు. పురోహితులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కలిదిండి సొసైటీ మాజీ అధ్యక్షుడు వడుపు రామారావు, వైఎస్సార్ సీపీ నాయకులు పోతురాజు లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..

మొవ్వ: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఆలయాల్లోని అమ్మవార్లకు బుధవారం ఆషాఢ సారెను సమర్పించారు. గ్రామంలోని శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం, శ్రీ బాలా త్రిపురసుందరీ సమేత భీమేశ్వర ఆలయం, రజకుల రామాలయం, గౌడ రామాలయం, షిరిడీ సాయిబాబా మందిరం, రేణుకమ్మ ఆలయంతో పాటు గంగానమ్మ ఆలయాల్లో అమ్మవార్లకు సారెను సమర్పించారు. ఆర్యవైశ్య సంఘ సభ్యులు ఎందూరి జగన్మోహనరావు, పువ్వాడ సురేష్, బెజవాడ సాంబశివరావు, మాటూరి వెంకటేశ్వరరావు, కంతేటి హేమ నవీన్, నందిపాటి రమేష్, ఎస్.సత్యనారాయణ, ఎస్.ఆంజనేయులు, పువ్వాడ రామకృష్ణతో పాటు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



విశేష అలంకారంలో రాజ్యలక్ష్మి అమ్మవారు



మొవ్వలో ఆషాఢ సారెతో భక్తులు

మహిళా సాధికారతకే మిషన్ శక్తి పథకం

మండవల్లి: మిషన్ శక్తి పథకం మహిళ సాధికారత కోసమేనని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ నాగలక్ష్మి అన్నారు. పెరికెగూడెంలో బుధవారం బేటీ బచావో బేటీ పడావో సమన్వయ సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ బాలికల రక్షణ, విద్య కోసం ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. మిషన్‌శక్తిలో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాథమికోన్నత విద్యాలయాల్లో బాలికల నమోదు శాతం పెంచాలన్నారు. డ్రాప్‌అవుట్లు తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వి.సీత, ఏఎన్ఎం ఏసు ప్రేమ, ఆశ కార్యకర్త సునీత, అంగన్‌వాడీ కార్యకర్తలు వెంకటేశ్వరమ్మ, ఆశాలత, శ్రీలత, విజయలక్ష్మి పాల్గొన్నారు.



పెరికెగూడెంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ నాగలక్ష్మి

విద్యార్థుల మానసిక పరిస్థితికి అనుగుణంగా బోధన

ముదినేపల్లి రూరల్: ప్రాథమిక విద్యార్థులకు మానసిక పరిస్థితులకు అనుగుణంగా నైపుణ్యాలతో బోధించాలని ఎంఈఓ-1 సేవ్యానాయక్ అన్నారు. మండలంలోని కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడుతూ ఇంగ్లిష్, లెక్కలు వంటి సబ్జెక్టులపై విద్యార్థుల్లో భయాలను తొలి దశలోనే పారదోలాలన్నారు. ఆయా సబ్జెక్టులపై ఆసక్తి కలిగేలా బోధన చేయాలని సూచించారు. వివిధ సబ్జెక్టులకు సంబంధించి పలు ప్రశ్నలు వేసి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు నూరుశాతం విద్యార్థులు బడిలోనే భోజనం చేసేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు.



విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్న ఎంఈఓ

బీజామృతంతో పలు ఉపయోగాలు

ముదినేపల్లి రూరల్: ప్రకృతి వ్యవసాయ సంబంధమైన బీజామృతంతో రైతులకు పలు ప్రయోజనాలు చేకూరతాయని ప్రకృతి వ్యవసాయ సీఆర్పీ ఎస్.గౌతమ్‌కుమార్ అన్నారు. మండలంలోని సింగరాయపాలెంలో బూరుబోయిన సుధాకర్ అనే రైతు పొలంలో వరినాట్లు వేసే ముందు నారును బీజామృతంతో శుద్ధి చేసి వరుస పద్ధతిలో బుధవారం నాట్లు వేశారు. ఈ సందర్భంగా గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ బీజామృతంతో నారు శుద్ధి చేసి కొసలు తుంచి మొక్కకు మొక్కకు మధ్య అడుగుదూరం ఉండేలా నాట్లు వేయాలన్నారు. వీఏఏలు అజయ్, భవానీ పాల్గొన్నారు.



ఉపాధిహామీ పథకం కూలీల పాలిట వరం

ఎంపీపీ పుష్పరాణి

గుడివాడరూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు వరం లాంటిదని ఎంపీపీ గద్దే పుష్పరాణి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం 2023–24 సంవత్సరంలో ఉపాధిహామీ పనులకు సంబంధించి సామాజిక ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకానికి సంబంధించి గ్రామాల్లో జరిగిన పనుల వివరాలను సోషల్ ఆడిట్ అధికారులు గ్రామాల వారీగా సమావేశంలో ఉపాధి హామీ అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. మండలంలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.6.32 కోట్ల పనులను నిర్వహించినట్లు ఏపీఓ దేవానందరాజు తెలిపారు. గ్రామాల వారీగా తనిఖీ సిబ్బంది జిల్లా నుంచి వచ్చిన ఆడిట్ అధికారులకు సమాచారాన్ని వివరించారు. వివిధ పనులకు సంబంధించి సక్రమంగా పని చేయని ఫీల్డ్ అసిస్టెంట్ల దగ్గర నుంచి అపరాధ రుసుం రూ.15,013ను అధికారులు వసూలు చేశారు. బొమ్ములూరు కెనాల్ కాల్వ గట్టుపై నాటిన మొక్కలకు సంబంధించి పనులకు ఏపీడీఓ ఎంక్వైరీ వేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని ప్రతి గ్రామంలోను విస్తరించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు జి.రామకృష్ణ, ఎంపీడీఓ జ్యోతి, వెలుగు ఏరియా కో–ఆర్డినేటర్ డీటీ సుందరరావు, పీఆర్ ఏఈ సూరిబాబు, ఏపీడీ నాంచారయ్య, ఎస్టీఎం కె.సత్యనారాయణ, ఎస్ఆర్పీ సీహెచ్ఎన్ సత్యనారాయణ, విజిలెన్స్ సిబ్బంది సురేష్ తదితరులు పాల్గొన్నారు.



సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్న అధికారులు, పాల్గొన్న ఎంపీపీ

జనవిజ్ఞాన వేదిక జాతీయ కార్యదర్శికి నివాళి

మండవల్లి: జనవిజ్ఞాన వేదిక జాతీయ కార్యదర్శి జంపా కృష్ణకిషోర్ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి స్థానిక స్టేషన్ రోడ్‌లో ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు, మండల అధ్యక్షుడు టి.అప్పారావు బుధవారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కృష్ణకుమార్ తన మరణానంతరం శరీరాన్ని మెడికల్ కళాశాల విద్యార్థులకు పరిశోధనల నిమిత్తం దానం చేయడం ఆయన సేవాగుణానికి నిదర్శమన్నారు. కార్యక్రమంలో సీహెచ్ వెంకట్, ఎస్.కృష్ణమోహన్, కె.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఎంఈఓ ప్రభాకరరావు మృతి



ప్రభాకరరావు(ఫైల్)

గుడివాడ టౌన్: విశ్రాంత ఎంఈఓ కొల్లి ప్రభాకరరావు (79) బుధవారం మృతిచెందారు. విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆయన మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సుదీర్ఘకాలం జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎంగా, మండల విద్యాశాఖాధికారిగా బాధ్యతలు నిర్వహించిన ఆయన స్థానిక టీచర్స్ కాలనీ సొసైటీ అధ్యక్షుడిగా సేవలందించారు. ఈయనకు ఇరువురు కుమార్తెలు. ప్రభాకరరావు అంత్యక్రియలు ఈనెల రెండో తేదీ గుడివాడలో నిర్వహిస్తారని కుటుంబ సభ్యులు తెలిపారు.

రోడ్లు బురదమయం



అధ్వానంగా మారిన అలీనఖీపాలెం-నమ్మితాలగుంట రోడ్డు



బురదమయంగా మారిన గంద్రపువానిగూడెం రోడ్డు

- చినుకు పడితే చిత్తడే
- అధ్వానంగా గంద్రపువానిగూడెం, నమ్మితాలగుంట రోడ్లు

పమిడిముక్కల: మండలంలోని మామిళ్లపల్లి శివారు గంద్రపువానిగూడెం, కూడేరు శివారు నమ్మితాలగుంట రోడ్లు అభివృద్ధికి నోచుకోవడం లేదు. చినుకు పడితే చాలు ఈ రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. ఒక మోస్తరు వర్షం కురిస్తే బురదమయంగా మారుతున్నాయి. కనీసం నడిచి వెళ్లేందుకు కూడా అవకాశం లేదు. గంద్రపువానిగూడెం వాసులు పోతురాజుమాలపల్లి దాటి మామిళ్లపల్లి రావాలన్నా, నమ్మితాలగుంట వాసులు అలీనఖీపాలెం దాటి చోరగుడి రావాలన్నా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు, వృద్ధుల బాధలు వర్ణనాతీతం. గతంలో ఎమ్మెల్యేగా ఉన్న కైలే అనిల్‌కుమార్ సూచన మేరకు జెడ్పీటీసీ సభ్యుడు యేనుగ వెంకటరమణకుమారి రూ.10 లక్షలు జెడ్పీ నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో కొంతమేర రబ్బీష్ రోడ్డు వేశారు. అయినప్పటికీ వర్షం పడితే రోడ్డంతా బురదమయంగా మారుతుందని, పూర్తి స్థాయిలో రహదారిని అభివృద్ధి చేయాలని సర్పంచ్ ఆముదాలపల్లి సుబ్రమణ్యం, గంద్రపువానిగూడెం వాసులు కోరుతున్నారు. నమ్మితాలగుంట రహదారి అభివృద్ధికి గతంలో ఎమ్మెల్యేగా ఉన్న కైలే అనిల్‌కుమార్ రూ.60 లక్షలు మంజూరు చేయించారు. కాగా ఈ రోడ్డు టెండర్ దశలో ఉందని ప్రాజెక్టు ఏఈ సుధాకర్ తెలిపారు. రోడ్డంతా బురదమయంగా మారిందని, రాకపోకలు సాగక ఇబ్బందులు పడుతున్నామని, అధికారులు రహదారిని పరిశీలించి వెంటనే పనులు ప్రారంభించాలని లంకపల్లి ఎంపీటీసీ సజ్జాద్ అలీ, నమ్మితాలగుంట వాసులు కోరుతున్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు



ఉపాధ్యాయ దంపతులను సత్కరిస్తున్న ఎంఈఓలు

ముదినేపల్లి రూరల్: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తేనే సమాజంలో తగిన గుర్తింపు లభిస్తుందని ఎంఈఓ-1 సేవ్యా నాయక్, ఎంఈఓ-2 కె.నరేష్‌కుమార్ అన్నారు. మండలంలోని చిగురుకోట, కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు వి.సూర్యప్రకాశరావు, రఘునాథబాబు బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మార్సీ భవన్‌లో ఉపాధ్యాయ దంపతులను ఎంఈఓలతో పాటు ఉపాధ్యాయ సంఘాల నేతలు సత్కరించారు. అదేవిధంగా ఏపీటీఎఫ్ నాయకుడు బేతాల రాజేంద్రప్రసాద్, యూటీఎఫ్ నాయకులు సాయిలత, రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దంపతులను సత్కరించారు.

ఏఓ వెంకట్రామయ్య సేవలు ప్రశంసనీయం

పమిడిముక్కల: ఏఓ ఎం.వెంకట్రామయ్య సేవలు ప్రశంసనీయమని ఎంపీడీఓ షేక్ మహబూబ్ సుభానీ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఏఓగా పనిచేసిన ఎం.వెంకట్రామయ్య బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వీడ్కోలు సభలో వెంకట్రామయ్య దంపతులను ఎంపీడీఓ సుభానీ, ఈఓఆర్డీ కొండేటి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్, కార్యదర్శులు, జిల్లా పరిషత్ ఉద్యోగులు, మండల పరిషత్ సిబ్బంది ఘనంగా సత్కరించారు.

ప్రజల మన్ననలు పొందాలి

పమిడిముక్కల: ఉద్యోగులు అంకితభావంతో పని చేసి ప్రజల మన్ననలు పొందాలని ఎంఈఓ-2 శ్రీనివాస్ పేర్కొన్నారు. అగినపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి బుధవారం ఉద్యోగ విరమణ చేసిన గుంటక కోట విజయభాస్కరరెడ్డి దంపతులను విద్యాకుటుంబం తరఫున ఘనంగా సత్కరించారు. విజయభాస్కరరరెడ్డి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో హెచ్ఎం ఫణికుమార్, గోగినేనిపాలెం హైస్కూల్ హెచ్ఎం వేణు, ఉపాధ్యాయులు నాగసుధారాణి, రాజ్యలక్ష్మి, అబూసిబ్‌తైన్, రవికుమార్, ఆంజనేయులు, చిట్టిబాబు, వెంకటేశ్వరరావు, శివ పాల్గొన్నారు.



ఉద్యోగ విరమణ చేసిన ఏఓ వెంకట్రామయ్య దంపతులను సత్కరిస్తున్న ఎంపీడీఓ



ఉద్యోగ విరమణ చేసిన జూనియర్ అసిస్టెంట్ విజయభాస్కరరెడ్డిని సత్కరిస్తున్న ఎంఈఓ-2



కార్యదర్శి వెంకటకృష్ణ దంపతులను సత్కరిస్తున్న ఎంపీపీ అశోక్‌కుమార్

సేవలందించిన వారిని ప్రజలు మరువరు

పామర్రు: ప్రజలకు ఉత్తమ సేవలందించిన అధికారులను ఎన్నడూ మరవబోరని ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిధి పెదమద్దాలి గ్రామ కార్యదర్శి రావులపాటి వెంకటకృష్ణ బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. ఎంపీపీ కార్యాలయంలో వెంకటకృష్ణ ఉద్యోగ విరమణ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి దంపతులను ఎంపీపీ ఘనంగా సన్మానించారు. ఎంపీడీఓ భారతి, కార్యాలయం సూపరింటెండెంట్ ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

పై ఓవర్‌పై మట్టి తొలగించండి



గుడివాడ టౌన్: స్థానిక విజయవాడ రోడ్‌లోని పై ఓవర్‌పై రెండు వైపులా మట్టి పేరుకుపోవడంతో అది ప్రమాదాలకు నిలయంగా మారింది. గతంలో రోజువారి రోడ్లు తుడిచే పనిలో భాగంగా పై ఓవర్ రెండు వైపులా మున్సిపల్ కార్మికులు శుభ్రపర్చేవారు. ఇటీవల కార్మికులు దీనిపై దృష్టిపెట్టక పోవడంతో మట్టి పేరుకుపోయి వర్షం వస్తే బురదమయంగా మారుతోంది. మట్టి కింద భాగం సిమెంట్ కాంక్రీట్ ఉండటం, పైన బురదగా మారడంతో వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నట్లు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి ఈ ప్రాంతాలు శుభ్రం చేయించేందుకు చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు.

భారీ వర్షం



పామర్రు: పామర్రులో బుధవారం మధ్యాహ్నం నుంచి భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి పల్లపు ప్రాంతాలు జలమయంగా మారాయి. స్థానిక గఫార్ సెంటర్, శివాలయం బజారు, కోటిరెడ్డిపేట, అరండాల్‌పేట, చౌదరి పేట, గాంధీ నగరం తదితర ప్రాంతాల్లో వర్షం నీరు రోడ్లపై నిలిచింది. రహదార్ల వెంబడి డ్రెయినేజీలు సక్రమంగా లేని కారణంగా నీరు రోడ్లపై నిలిచి పోతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారి పక్కనే ఉన్న డ్రెయినేజీల్లో అడ్డంకులను తొలగించాలని కోరుతున్నారు.

దోమల నివారణ మందు పిచికారీ



కూచిపూడి(మొవ్వ): గ్రామాల్లో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధులు ప్రబలకుండా వైద్య శాఖ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఆరోగ్య సిబ్బంది పంచాయతీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు దోమల నివారణ మందును బుధవారం పిచికారీ చేశారు. అలాగే స్ప్రే చేయించటంతో పాటు సున్న, బ్లీచింగ్ చల్లించే కార్యక్రమంలో నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగా కూచిపూడిలో పంచాయతీ కార్యదర్శి ఇస్లావత్ భవాని, ఆరోగ్య కార్యకర్త కే ఆంజనేయులు ఏఎన్ఎం దగాని వసుంధర పర్యవేక్షణలో పంచాయతీ సిబ్బంది కూచిపూడిలో దోమల నివారణ చర్యలు చేపట్టారు.

వెంకటేశ్వరరావు కుటుంబానికి ఎమ్మెల్సీ పరామర్శ

కైకలూరు: ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ గోనెపాడు గ్రామంలో నంగెడ్ల వెంకటేశ్వరరావు దశదిన కర్మలో బుధవారం పాల్గొన్నారు. ఇటీవల అనారోగ్యంతో వెంకటేశ్వరరావు మరణించారు. ఆయనతో తనకున్న సాన్నిహిత్యాన్ని ఎమ్మెల్సీ వివరించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

గుడివాడ డీఎస్పీ శ్రీకాంత్ బదిలీ

గుడివాడరూరల్: గుడివాడ డీఎస్పీ పి.శ్రీకాంత్ బుధవారం బదిలీ అయ్యారు. రాష్ట్రంలో 96 మంది డీఎస్పీల బదిలీల్లో భాగంగా డీఎస్పీని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కు రిపోర్ట్ చేయాలని డీజీపీ ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతానికి గుడివాడ డీఎస్పీగా ఇంకా ఎవరినీ ప్రభుత్వం నియమించలేదు.